క్లుప్తంగా

మాజీ ఎంపీటీసీకి పరామర్శ



దామెర : స్థానిక మాజీ ఎంపీటీసీ సభ్యుడు మొద్దు ప్రవీణ్ తండ్రి మొద్దు సమ్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట ఆత్మకూరు ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ గజ్జి విష్ణు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పాలిపాక శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుర్శెట్టి భిక్షపతి, సీనియర్ నాయకులు సదిరం పోచయ్య, దామెర శంకర్, నగేష్, దండు విజేందర్, మాదాసు చిరంజీవి, పెంట కొమురయ్య, సిలువేరు అనిల్, భిక్షపతి, మేకల ప్రవీణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

'పట్టభద్రులను ఓటరుగా నమోదు చేయించండి'

సంగెం: గ్రామాల్లోని అర్హులైన పట్టభద్రులను ఓటరుగా నమోదు చేయించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మండలంలోని 45 పోలింగ్ బూత్‌ల పరిధిలో పట్టభద్రులను గుర్తించి ఓటరుగా నమోదు చేయించాల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉందన్నారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించడానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. మండల కోఆర్డినేటర్ ఆకుల రుద్రప్రసాద్‌ను పరకాల గ్రాడ్యుయేట్ ఎన్నికల కోఆర్డినేటర్ మాద్రా విజయ్‌కుమార్ నియమించారు. .

మొండ్రాయి వాసికి 'యూపీఎస్సీ' ఉద్యోగం

సంగెం : మండలంలోని మొండ్రాయి గ్రామానికి చెందిన సింగిరెడ్డి రాధ-కుమారస్వామి దంపతుల కుమారుడు శ్రీకాంత్ ఇటీవల వెలువడిన యూపీఎస్సీ ఫలితాల్లో జియో సైంటిస్ట్ (గెజిటెడ్ హోదా) ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను, అతడి తల్లిదండ్రులను గ్రామస్తులు అభినందించారు.

నిరుపేదల సమస్యలు పరిష్కరించాలి

గీసుకొండ : నిరుపేదల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కోరారు. గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ పరిధిలోని గొర్రెకుంట శివారులో శనివారం నిర్వహించిన గుడిసెవాసుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇళ్లు లేని, గుడిసెలు వేసుకున్న పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతోపాటు గుడిసెవాసులపై గతంలో బనాయించిన కేసులను ఎత్తివేయాలని ఆకాంక్షించారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మేకల రవి, సహాయ కార్యదర్శి బాషుమియా, నాయకులు గుండె భద్రి, బుస్సా రవీందర్, గన్నారపు రమేశ్, దండు లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

నర్సంపేట : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. పట్టణంలోని సీపీఐ గుడిసెవాసుల కాలనీలో భారత జాతీయ మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు పాలక కవిత ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవరెడ్డి హాజరై మాట్లాడారు. గుడిసెవాసులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. అభయహస్తం దరఖాస్తులు అందజేసిన పేదలందరికీ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయనుందని అన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో ప్రతిభ చాటిన విజేతలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, నాయకులు వేముల సాంబయ్యగౌడ్, లక్ష్మణ్‌నాయక్, సీపీఐ నాయకులు నేదునూరి జ్యోతి, పంజాల రమేశ్, తోట చంద్రకళ, రమేశ్, గడ్డం యాకయ్య, కందిక చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్‌లోని మొగిలిచర్ల గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ ప్రతినిధులు శనివారం స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మామిడాల రమేశ్‌బాబు, ప్రతినిధులు కుమారస్వామి, రాజయ్య, గోపాల్, వైద్యనాథ్, ఆకుల శ్రీనివాస్, హెచ్‌ఎం జ్యోతిర్మయి పాల్గొన్నారు.

పిండివంటల ఘుమఘుమలు



సకినాలు పోస్తున్న మహిళలు



పిండి వంటకాలు చేస్తున్న మహిళ



పిండితో చేసిన సకినాలు



తయారైన మురుకులు

ఎల్కతుర్తి : సంక్రాంతి అంటేనే ముందుగా గుర్తుకొచ్చేది పిండివంటలు. ఈ పండుగకు నోరూరించే సకినాలు, గ్యారలు, మురుకులు ప్రధానమైన పిండివంటలుగా చెప్పవచ్చు. ఈనెల 15వ తేదీన సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాలతో పాటు వివిధ గ్రామాల్లోని ఇంటింటా పిండివంటలతో ఘుమఘుమలాడుతున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులంతా వసతి గృహాల నుంచి స్వగ్రామాలకు చేరుకున్నారు. దీంతో పిల్లలు, పెద్దలు కలిసి సంక్రాంతి సంబురాలు ఉత్సాహంగా గడిపేందుకు సిద్ధమయ్యారు. స్త్రీలు చేసే పిండివంటకాల్లో పురుషులు సైతం ఆసరా అవుతున్నారు. ప్రధానంగా సకినాలు, గ్యారలు, మురుకులు పెద్ద మొత్తంలో చేసుకుంటున్నారు. దీంతో గ్రామాల్లోని పిండి గిర్నిల వద్ద మహిళలు క్యూ కడుతున్నారు. తీపికి గుర్తుగా అర్శలు, కర్యలు, గవ్వలను అల్లి చక్కర పానకంలో తీసి తియ్యటి పిండి వంటకాలను తయారు చేసుకుంటున్నారు. దీంతో పలు వీధులన్ని పిండి వంటలకాలతో ఘుమఘుమల సువాసనలు విరజిమ్ముతున్నాయి. పెద్దలు పిండివంటలు చేస్తుండగానే పిల్లలు సకినాలను జేబుల్లో నింపుకొని సందడి చేస్తున్నారు. ఆదివారం భోగి పండగ కావడంతో మహిళలు, యువతులు తమ ఇళ్లలోగిళ్ల ముందు కలర్‌ఫుల్ రంగవల్లులు వేసి వాటిపై ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలు పొందుపర్చేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో గ్రామాల్లో సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటనున్నాయి. పిల్లలు ఇప్పటికే గాలిపటాలు ఎగురవేస్తూ కేరింతలు కొడుతున్నారు.

నగదు, ఆభరణాలను లాకర్లలో ఉంచాలి



మాట్లాడుతున్న సంజీవ్

కమలాపూర్ : సంక్రాంతి పండుగ సందర్భంగా ఊరెళ్తున్న, వేములవాడ, కొత్తకొండ, మేడారం వంటి జాతరలకు వెళ్తున్న వారు జాగ్రత్తలు పాటించాలని కమలాపూర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ బొలుమల్ల సంజీవ్ సూచించారు. శనివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. నగదు, బంగారు ఆభరణాలను బ్యాంకు లాకర్లలో దాచుకోవాలని సూచించారు. ఇటీవల కాలంలో తాళం వేసి ఉన్న ఇళ్లల్లో, ఊరి చివరన ఉన్న ఇళ్లల్లో దుండగులు దొంగతనాలకు పాలుపడ్డ సంఘటనలు వెలుగు చూశాయని అన్నారు. దొంగతనాలను అరికట్టేందుకు పొరుగూరికి వెళ్తున్న వారు తమ నగదు, బంగారు ఆభరణాలను బ్యాంకు లాకర్లలో దాచుకోవాలని, లేదంటే తమ బంధువులకు అప్పగించి వెళ్లాలని సూచించారు. అదే విధంగా ఊరెళ్తున్న విషయాన్ని ఇరుగుపొరుగు వారికి చెప్పి అప్పుడప్పుడు తమ ఇంటిని గమనిస్తూ ఉండాలని చెప్పి వెళ్లాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే 100 డయల్ చేయాలని, లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

గృహలక్ష్మి లబ్ధిదారులకు అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆత్మకూరు : నియోజకవర్గంలోని గృహలక్ష్మి లబ్ధిదారులకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. హనుమకొండలోని ఆయన నివాస గృహంలో శనివారం మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఆ పథకాన్ని రద్దు చేయడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. లబ్ధిదారులను ఇందిరమ్మ పథకంలో చేర్చాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో 3వేల మంది గృహలక్ష్మికి ఎంపిక కాగా 500 మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. వారికి బిల్లులు చెల్లించాలని వరంగల్, హనుమకొండ కలెక్టర్లకు వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోక పోవడంతో కోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. గృహలక్ష్మి లబ్ధిదారులకు బిల్లులు చెల్లించి జాబితాను పునఃపరిశీలించాలని అధికారులను కోర్టు ఆదేశించినట్లు ధర్మారెడ్డి చెప్పారు. లబ్ధిదారులకు పూర్తిగా న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని ఆయన స్పష్టం చేశారు.

యువకులు క్రీడల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న మహ్మద్ పాషా

ధర్మసాగర్ : గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మహ్మద్ పాషా తెలిపారు. మండలంలోని దేవునూర్ గ్రామంలో అవెల్లి ట్రస్టు ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన క్రీడా కారులకు బహుమతులను అందించారు. అంబేడ్కర్ యూత్ టీం మొదటి బహుమతి రూ. 10 వేలు గెలుచుకోగా, ప్రగతి యూత్ టీం ద్వితీయ బహుమతి రూ. 5 వేలు గెలుచుకుంది. ఈ సందర్భంగా విజేతలకు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు కంకటి తిరుపతి, అవెల్లి ట్రస్ట్ ప్రతినిధి పద్మ, యువకులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో శాశ్వత పనులు

హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో శాశ్వత పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. రెండవ డివిజన్‌లోని గుండ్లసింగారంలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురుగునీటి కాలువలు, అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, చెరువు శిఖం కబ్జాకు గురికావడంతో కాలనీ మొత్తం ముంపునకు గురవుతోందని ఎమ్మెల్యేకు స్థానికులు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ నిధులతో శాశ్వత పనులు చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రవినాయక్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నర్సింహారెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు, మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన, అజయ్ తదితరులు పాల్గొన్నారు. క్రీడలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. హసన్‌పర్తి మండలం మడిపల్లి గ్రామంలో చిర్ర చేరాలు - జయలక్ష్మి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు.

నేత్ర పర్వంగా గోదాదేవి కల్యాణం



ఐనవోలు : గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కమలాపూర్ : గోదాదేవి కల్యాణంలో పాల్గొన్న ఎంపీపీ రాణి, భక్తులు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి స్వయంభూ శ్రీలక్ష్మీనృసింహాస్వామి ఆలయంలో అర్చకులు నేత్ర పర్వంగా గోదాదేవి కల్యాణం నిర్వహించారు. ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం గోదా అమ్మవారు శ్రీరంగనాధుడిలో ఐక్యమైన సందర్భంగా ధనుర్మాస వ్రతంలో 29వ రోజు గోదా కల్యాణం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి గోదా కల్యాణం, హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు. ఆలయ చైర్మన్ సత్యనారాయణ, డైరక్టర్లు మోహన్, కుమారస్వామి, అర్చకులు జయకృష్ణ, వెంకటరత్నం, రవి, వంశీ పాల్గొన్నారు.

కమలాపూర్ : శనిగరం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో సంక్రాంతి, ధనుర్మాసం సందర్భంగా శనివారం గోదాదేవి, రంగనాయకుల స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దెత్తున తరలివచ్చి గోదాదేవి, రంగనాయకుల స్వామి కల్యాణ మహోత్సవాన్ని కనులారా తిలకించారు. ఎంపీపీ తడక రాణిశ్రీకాంత్, ఆలయ అర్చకుడు శ్యాం సుందరాచార్యులు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

రామమందిరం పేరుతో బీజేపీ రాజకీయం

న్యూశాయంపేట: అయోధ్యలో రామ మందిరం పేరుతో రాజకీయం చేస్తూ ప్రజా సమస్యలను ప్రధాని మోదీ గాలికి వదిలేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు విమర్శించారు. హనుమకొండ బాలసముద్రంలోని కార్యాలయంలో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మనోభావాలను బీజేపీ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగం పెరిగి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కొరవడి, ఆర్థిక వ్యవస్థ పతనమవుతున్న తరుణంలో వాటినుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు కేంద్రం రామజపం చేస్తోందని ఎద్దేవాచేశారు. మోదీ నాటకాలను ప్రజలు గమనించి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. పార్టీ సహాయ కార్యదర్శి ఎల్లేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు కర్రె భిక్షపతి, తోట భిక్షపతి, ఆదిరి శ్రీనివాస్, సదాలక్ష్మి, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, రవి, దీన రాజమణి సదానందం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఖండించండి

వరంగల్: పాలస్తీనా దేశంపై ఇజ్రాయిల్ జరుపుతున్న క్రూర, అమానవీయ దాడులకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు కార్యక్రమాలు చేపట్టాలని వివిధ శాంతియుత సంస్థలు, ప్రజాహిత శక్తులు పిలుపునిచ్చాయని స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (ఎస్ఐఓ) వరంగల్ సిటీ అధ్యక్షుడు ఫహియొద్దీన్ సూచించారు. ఈమేరకు పోచమ్మమైదాన్ జంక్షన్‌లో ప్లకార్డులతో శనివారం సాయంత్ర నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలదాచుకోవడానికి శరణం ఇచ్చిన పాలస్తీయన్ల పైనే ఇజ్రాయిల్ దాడులు చేయడం శోచనీయమని విమర్శించారు. అనేక మంది పాలస్తీయన్లు, వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలు ఇజ్రాయిల్ దాడుల్లో రోజూ మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత కర్కశంగా ఇజ్రాయిల్ ప్రవర్తిస్తున్నా దేశాలు నోరు మెదపకపోవడం మానవత్వానికే మచ్చ అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆహార ఉత్పత్తి రంగంలో ప్రోత్సాహం

- సర్వోదయ సంస్థ కార్యదర్శి డాక్టర్ దామోదర్



పిండిగిర్ని యూనిట్‌ను ప్రారంభించిన దామోదర్

కమలాపూర్ : ఆహార ఉత్పత్తి రంగంలో మహిళలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహిస్తున్నాయని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటులో భాగంగా గొర్రె రమ్య నెలకొల్పిన పిండి గిర్ని యూనిట్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారతకు పెద్ద పీట వేస్తున్నాయని, మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు ప్రధాన మంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం ద్వారా ప్రోత్సాహం అందిస్తోన్నాయని అన్నారు. సర్వోదయ, నాబార్డ్ సహకారంతో 90 మంది మహిళలకు ఆహార ఉత్పత్తుల తయారీలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. శిక్షణ అనంతరం మహిళలు బిస్కెట్లు, మటన్, చికెన్, చేపల పచ్చళ్ల తయారు చేసి వ్యాపార సంస్థలు ఏర్పాటు చేసుకున్నారని పేర్కొన్నారు. వ్యాపారం ప్రారంభించేందుకు బ్యాంకు ద్వారా రూ.2 లక్షల వరకు రుణం కూడా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ కవిరాజ్, కో ఆర్డినేటర్లు రవి, తిరుమల, ఐకేపీ కంప్యూటర్ ఆపరేటర్ శ్రీకాంత్, సీఏ పుల్ల బుజ్జమ్మ, స్వయం సహాయక సంఘ సభ్యులు సరిత పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి



పరకాల : ముగ్గులు వేస్తున్న మహిళలు



దామెర : బహుమతులు ప్రదానం చేస్తున్న రాకేష్

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ సోదా అనిత

పరకాల : విదేశీ సంస్కృతి పెరుగుతున్న నేటి సమాజంలో దేశ భవిష్యత్‌ను కాపాడుకునేందుకు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, కరీంనగర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.లలితాదేవి అన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా పరకాల మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి ఆధ్వర్యంలో పద్మశాలి భవన ప్రాంగణంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విజేతలకు బహుమతుల ప్రదానోత్సవానికి వారు హాజరై విజేతలకు జ్ఞాపికలు అందించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందిచేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, ప్రముఖ వైద్యుడు మంత్రి కాశయ్య, కౌన్సిలర్ శనిగరపు రజనీతో పాటు న్యాయనిర్ణేతలు నాగబండి జమునారాణి, వకులాదేవి, ప్రమీల పాల్గొన్నారు.

దామెర : తెలుగు సంప్రదాయాలను ప్రతిఒక్కరూ పాటించాలని సమత జెన్‌క్రెస్ట్‌బయో ప్రొడక్ట్ లిమిటెడ్ ఆర్‌బీహెచ్ సదిరం రాకేష్ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. అనంతరం ఉత్తమ ముగ్గులను గర్తించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిఒక్కరూ గౌరవించాలని అన్నారు. టీఎస్ఎం రంజిత్, సేల్స్ ఆఫీసర్ రజినీకర్, మహిళలు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేయాలి

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- క్యాతంపల్లిలో జీపీ కార్యాలయం ప్రారంభం



గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్ : రాష్ట్రంలో గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను రద్దు చేయొద్దని, రాజకీయాలకతీతంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తిచేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. క్యాతంపల్లిలో గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతోపాటు అదనంగా మరిన్ని నిధులు వస్తే గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని పేర్కొన్నారు. దళిత బంధు లబ్ధిదారుల ఖాతాల ఫ్రీజింగ్‌ను ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కక్షసాధింపు చర్యలకు పోకుండా ప్రజలందరికి ఉపయోగపడే విధంగా పాలన కొనసాగించాలని అన్నారు. క్యాతంపల్లిలో ముదిరాజ్ కమ్యూనిటీ హాల్, అంబేడ్కర్ కమ్యూనిటీహాల్, పాఠశాలలో అదనంగా రెండు తరగతి గదుల నిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరు చేస్తానని కడియం శ్రీహరి హామీ ఇచ్చారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించాడని కొనియాడారు. ఆర్టికల్-3తోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోగలిగామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిన్నపురెడ్డి అవనిజ విప్లవ్‌కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ పిట్టల శ్రీలత, ఉప సర్పంచ్ కుర్సపల్లి రాజు, అంబేడ్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షుడు గంధమాల సాంబరాజు, పీఆర్ డీఈ దయాకరాచారి, ఎంపీడీఓ జవహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



రక్తదాతలను అభినందిస్తున్న గౌతమ్‌చౌహాన్

పరకాల : రక్తదానం చేస్తే మరొకరికి ప్రాణదానం చేసినట్లు అవుతుందని పరకాల సివిల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ గౌతమ్ చౌహాన్ అన్నారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని స్నేహయూత్ ఆధ్వర్యంలో యువకులు స్థానిక బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదాతలకు ప్రశంసపత్రాలు అందించిన ఆయన అనంతరం మాట్లాడారు. రక్తదాతలకు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని, ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. ప్రాణపాయ స్థితిలో ఉన్న మరొకరికి ప్రాణదానం చేసినట్లు అవుతుందని అన్నారు. అలాంటి సమస్య బయట వ్యక్తులకే కాకుండా అనుకోకుండా మన కుటుంబంలో ఏవరికైనా రావచ్చని ఆ పరిస్థితిలో నిల్వ చేసిన రక్తంతోనే వారి ప్రాణం కాపాడుకోవడం జరుగుతుందన్న విషయాన్ని గమనించాలన్నారు. రక్తదానం చేయడపై కొందరిలో ఉన్న అపోహలను తొలగించేందుకు అవగాహన కల్పించాలని సూచించారు. యువకులు, విద్యార్థులు రక్తదానం చేయడం ద్వారా జరిగే ప్రయోజనాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ పూజ



ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా హనుమాన్‌పూజ నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఆరుట్ల మాధవమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో తిరుప్పావై అనుసంధానం చేశారు. భజన మండలి సభ్యులు సంకీర్తనలు ఆలపించారు. దీంతో మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది.

సదస్సులతో నైపుణ్యాల పెంపు

హసన్‌పర్తి: సాంకేతిక సదస్సులతో నైపుణ్యాలు పెంపొందుతాయని కాకతీయ యూనివర్సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య అన్నారు. కిట్స్ కళాశాలలో ఫిబ్రవరి 2, 3వ తేదీల్లో నిర్వహించనున్న జాతీయ విద్యార్థి సాంకేతిక సింపోజియం సమశోధిని -23' పోస్టర్లను కళాశాల ప్రాంగణంలో శనివారం ఆవిష్కరించారు. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, కిట్స్ స్టూడెంట్ చాప్టర్, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ కార్యక్రమాన్ని పురస్కరించుకుని అన్ని ఇంజనీరింగ్ విభాగాల్లో వర్క్‌షాపులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సదస్సులో పాల్గొనడానికి ఆసక్తి గల వారు www.sumshodini.kitsw లేదా kitsw.ac.in ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యార్థి సాంకేతిక పరిశోధనల పత్రాలను www.sumshodini@kitsw.ac.in ఈ-మెయిల్ ద్వారా జనవరి 20వ తేదీలోపు పంపించాలని తెలిపారు.